విశాలాంధ్ర కృష్ణా జిల్లా

మృతుని కుటుంబానికి ఆర్థికసాయం

విశాలాంధ్ర-కూచిపూడి: మొవ్వ మండలం కూచిపూడి గ్రామ సచివాలయ పరిధిలోని దుర్గా నగర్ (దక్షిణ దళితవాడ) లో గుండెపోటుతో పాగోలు శ్రీనివాసరావు మృతి చెందారు. వైయస్సార్ బీమా పథకంలో నామిని గానున్న భార్య పాగోలు వెంకటేశ్వరమ్మకు మృతుని మట్టి ఖర్చుల నిమిత్తంరూ.10 వేలు ఆర్థిక సహకారంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని గ్రామ పంచాయతీ కార్యదర్శి భవాని, వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ ఉమామహేశ్వరరావుల పర్యవేక్షణలో పంచాయతీ జూనియర్ అసిస్టెంట్ ఏ. ఫణీంద్ర అందజేశారు.

అర్హులైన ప్రతి ఒక్కరికి పింఛన్

విశాలాంధ్ర-కూచిపూడి: ఈనెలలో మొవ్వ మండలానికి మంజూరైన 145 కొత్త పింఛన్లను శుక్రవారం పంపిణీ చేశారు. కూచిపూడి సచివాలయానికి సంబంధించి 13 పెన్షన్లు మంజూరుకాగా పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ కొండవీటి వెంకటరమణ విజయలక్ష్మి పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా ఈవోపీఆర్డి వీర్ల సీతారామరాజు హాజరయ్యారు. పంచాయతీ కార్యదర్శి ఇస్లావత్ భవాని, వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ ఈ ఉమామహేశ్వరరావు, పంచాయతీ పాలకమండలి సభ్యుడు (రెండో వార్డ్) కావూరి పూర్ణచంద్ర శర్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలు విడనాడాలి

విశాలాంధ్ర-కూచిపూడి: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసన వ్యక్తం చేస్తూ సిపిఎం పార్టీ సంతకాల సేకరణ కార్యక్రమాలు నిర్వహించి సచివాలయాలలో వినతి పత్రాలను అంద చేస్తోంది. దీనిలో భాగంగానే శుక్రవారం మొవ్వ మండలం అవనిరిపూడి సచివాలయంలో గ్రేడ్ 5 కార్యదర్శి ప్రత్యూషకు నిత్యావసర వస్తువులు తగ్గించాలని, విద్యుత్ చార్జీలు తగ్గించాలని, నిరుద్యోగం తగ్గించేందుకు చర్యలు చేపట్టాలనే తదితర అంశాలతో కూడిన సంతకాలు చేసినవినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు శీలం నారాయణ రావు, ఏనుగు శ్రీనివాసరావు (కొండ), జొన్నలగడ్డ భాస్కరరావు, మేడిశెట్టి వీరాంజనేయులు, వంగూరి వీరబాబు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సంపూర్ణ పోషణతో పూర్తి ఆరోగ్యం

విశాలాంధ్ర-కూచిపూడి: అత్యంత విలువ గల పోషక పదార్థాలు కలిగిన వైఎస్సార్ సంపూర్ణ పోషణ ద్వారా లభ్యమయ్యే ఆహారాన్ని విని యోగించుకుని సంపూర్ణ ఆరోగ్యం పొందాలని మొవ్వ ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆఫీసర్ పీ భానుమతి హితవు పలికారు. ఆమె శుక్రవారం కూచిపూడి అగ్రహారంలోని అంగన్వాడీ సెంటర్ను పరిశీలించారు. ఏడుగురు బాలింతలు, గర్భవతులకు సంపూర్ణ పోషణ కిట్లను పంపిణీ చేశారు. అంతకు ముందుగా ఆమె అంగన్వాడి కేంద్రంలోని రికార్డులను, ప్రీ స్కూల్ పిల్లల వివరాలను, నమోదు హాజరు, పిల్లల బరువు తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి అంగన్వాడీ కార్యకర్త సరస్వతికి నిర్వహణపై సూచనలు అందజేశారు.

అంబేద్కర్ విగ్రహాలు ఏర్పాటు చేయాలి

విశాలాంధ్ర-గుడివాడ: స్థానిక కోతి బోమ్మ సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహాన్ని ఫ్లై ఓవర్ బిడ్జి ఏర్పాటు వల్ల తొలగించాలని ప్రభుత్వం అలోచన చేస్తుందని, దానిని బస్‌స్టాండ్ వద్ద నూతనంగా నిర్మించే ప్రధాన ఫ్లైఓవర్ వద్ద ఏర్పాటు చేయాలని, లేని పక్షంలో స్థానిక నెహ్రూచౌక్‌లో ఏర్పాటు చేయాలని దళిత సంఘుల ఐక్యవేదిక నాయకులు పొంగులేటి జయరాజు, కంచర్ల సుధాకార్, దారం కరుణాకర్, వేల్పూల నాగబాబులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఎన్‌జివో హూమ్‌లో దళిత సంఘుల ఐక్యవేదిక కన్వీనర్లు పొంగులేటి, కంచర్ల అధ్వర్యంలో నిర్వహించారు. ఐక్యవేదిక నాయకులు మొండ చంద్రపాల్, కోదమాల గంగాధరరావు, మొండు జోజిబాబు, అత్తాటి సాల్మన్, మరియబాబు, విలియం, పాల్, తదితరులు పాల్గొన్నారు.

పుల్లపాడులో టీడీపీ భవిష్యత్తుకు గ్యారెంటీ

విశాలాంధ్ర-పెడన: పెడన మండలం పుల్లపాడులో భవిష్యత్తుకు గ్యారెంటీ - ఇది బాబు గ్యారంటీలో పెడన నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ కాగిత కృష్ణ ప్రసాద్ శుక్రవారం పాల్గొన్నారు. గ్రామంలో తిరుగుతూ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టారు. టీడీపీ అధికారంలోకి వస్తే జరిగే ప్రయోజనాలను వివరించారు. నియోజకవర్గ పరిశీలకులు సాదరబోయిన ఏడుకొండలు, టీడీపీ నాయకులు పడమట గంటయ్య, శలపాటి వీరప్రసాద్, గూడూరు మాజీ ఎంపీపీ కాసగాని శ్రీనివాసరావు, శీరం ప్రసాద్ మురాల ఫణికుమార్, సమ్మెట రాంబాబు, చింతల వెంకటరత్నం, బొర్రా కాశి, తాహీరున్నిసా, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

జన సంక్షేమమే జగనన్న ప్రభుత్వ లక్ష్యం

విశాలాంధ్ర-గూడూరు: గూడూరు మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిషత్ అధ్యక్షులు సంగా మధుసూదనరావు అధ్యక్షతన వైఎస్సార్ పెన్షన్ కానుక కార్యక్రమం శుక్రవారం జరిగింది. 200 మంది లబ్ధిదారులకు కొత్తగా పింఛన్లు అందించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మాత్యులు జోగి రమేష్ తనయుడు, వైసీపీ రాష్ట్ర యువజన నాయకులు జోగి రాజీవ్ చేతుల మీదుగా లబ్ధిదారులకు పింఛను పంపిణీ చేశారు. జడ్పీటీసీ వేముల సురేష్ రంగబాబు, స్టేట్ ఫైనాన్స్ డైరెక్టర్ కారుమంచి కామేశ్వరరావు, స్టేట్ ఎంఎస్ఎంఈ డైరెక్టర్ గొరిపర్తి రవికుమార్ తదితర నాయకులు పాల్గొన్నారు.

సీఎం మైనారిటీల పక్షపాతి

విశాలాంధ్ర-పెడన: సీఎం జగన్ ముస్లిం మైనార్టీ వర్గ ప్రజల పక్షపాతి అని ఆయన, వారి సంక్షేమం కోసం ఎనలేని కృషి చేస్తున్నారని వైసీపీ మైనార్టీ విభాగం కృష్ణాజిల్లా అధ్యక్షుడు అయుబ్ ఖాన్ పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు ఖాదర్బాషా ఆదేశాల మేరకు వైసీపీ మైనార్టీ విభాగం కృష్ణా జిల్లా అధ్యక్షుడు అయుబ్ ఖాన్ పెడన పట్నంలోని కట్లపల్లి, బిస్మిల్లా నగర్ మసీదులలో "హర్ దిల్ మే వైఎస్ఆర్ హమ్ సబ్ జగన్‌కే సాత్" నిర్వహించారు. మున్సిపల్ కౌన్సిలర్లు బాబూలాల్, కోమట్ల అనిల్, పెడన పట్టణ సచివాలయాల కన్వీనర్ మతిన్‌ఖాన్, పెడన టౌన్ ఐదోవార్డు సచివాలయ కన్వీనర్ షేక్ నూరుద్దీన్ పాల్గొన్నారు.

అటవీ భూములు, వన్యప్రాణులను రక్షించాలి

విశాలాంధ్ర-మచిలీపట్నం: జిల్లాలో అటవీ భూములతో పాటు వన్య ప్రాణాలను సంరక్షించాలని, అడవుల ఆక్రమణదారులపై వారంలోగా క్రిమినల్ కేసులు బనాయించాలని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ నగరంలోని వారి చాంబర్లో జిల్లాస్థాయి అటవీ వన్యప్రాణి సంరక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కొత్త జిల్లాలు ఏర్పడ్డాక జిల్లాలో అటవీ విస్తీర్ణం 28008.84 హెక్టార్లు ఉందన్నారు. జాతీయ అటవీ విధానం 1988 ప్రకారం 33 శాతం అటవీ విస్తీర్ణం కలిగి ఉండాల్సి వుండగా జిల్లాలో కేవలం 7.42 శాతం అటవీ భూమి ఉందన్నారు. ఆ మేరకు 33 శాతం అటవీ భూమిని వృద్ధి చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు. ఇందులో భాగంగా ఆక్రమణదారులపై ఉక్కు పాదం మోపి ఆక్రమణలు తొలగించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఆక్రమణదారులు ఎంతటి వారైనా సరే విడిచి పెట్టవద్దని స్పష్టం చేశారు. ముఖ్యంగా మెట్లపల్లి బీట్ పరిధిలోని సురవరం, పోతురాజు గట్టు, నూతుల గట్టు, మెట్లపల్లి, మాలగట్టు, కాత్రేనిపాడు, రిజర్వు అటవీ భూభాగంలోని 310.39 హెక్టార్ల లో ఆక్రమణలు జరిగినట్లు గుర్తించడం జరిగిందన్నారు. అలాగే కానూరు రిజర్వ్ ఫారెస్ట్ లో కూడా 635.77 హెక్టార్ల అటవీ భూమి చాలా వరకు ఆక్రమణకు గురైనట్లు గుర్తించడం జరిగిందన్నారు. ఈ అటవీ భూభాగాన్ని ఆక్రమించిన వారిపై వారం రోజుల్లోగా క్రిమినల్ కేసులు బనాయించి కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వాటిని తిరిగి సంరక్షించుకొనుటకు అన్ని చర్యలు గట్టిగా చేపట్టాలన్నారు. అటవీ వన్యప్రాణుల సంరక్షణ చట్టం 1972 ప్రకారం ఆలివ్ ఇడ్లీ సముద్ర తాబేళ్లు షెడ్యూల్ ఒకటి జాతి కిందికి వస్తాయన్నారు. జాలర్ల మర బోట్ల ఫ్యాన్ చక్రం తాకడం వలన వాటి మరణాల శాతం సముద్ర తీరం వెంబడి ఎక్కువగా ఉందని, వాటి మరణాలను తగ్గించేందు కోసం మత్స్యశాఖ వారు మర బోట్లకు లైసెన్సులు, అనుమతులు ఇచ్చే ముందు తప్పనిసరిగా మారబోట్లకు ప్రత్యేకమైన పరికరాలు ఏర్పాటు చేసుకోవాలని షరతుతో కూడిన అనుమతులు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. అంతేకాకుండా ఇదివరకే ఇచ్చిన మరబోట్లకు తాబేల్లు చనిపోకుండా ప్రత్యేకమైన పరికరాలను తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని, ఈ విషయమై మత్స్యకారులందరికి అవగాహన కలిగించాలని సూచించారు. మచిలీపట్నానికి పూర్వ వైభవం తీసుకురావాలన్నారు. పట్టణ పిల్లలు, పెద్దలు పట్టణంలోని కాలుష్యం నుండి బయటకు వచ్చి ఆహ్లాదకర వాతావరణంలో ఆడుకొనుటకు విశ్రాంతి తీసుకొనుటకు నగర వనాన్ని ఏర్పాటు చేయాలన్నారు. ఇందు కోసం మంగినపూడి బీచ్ ప్రాంతంలో 20 ఎకరాలను గుర్తించి పర్యాటక ప్రదేశంగా నగరవనంగా తీర్చిదిద్దేందుకు రెవెన్యూ, అటవీశాఖ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాను మంచి పర్యాటక ప్రదేశంగా తీర్చిదిద్దేందుకోసం హంసలదీవి, మోపిదేవి, ఓడరేవు, హార్బర్, తదితర ప్రముఖ పుణ్యక్షేత్రాలు చారిత్రాత్మక ప్రదేశాలను, ఆహ్లాదకర ప్రదేశాలను కలుపుతూ ఒక పర్యాటక సర్క్యూట్ను ప్రణాళిక బద్ధంగా సిద్ధం చేయాలన్నారు. తద్వారా జిల్లాకు మంచి రాబడి వస్తుందన్నారు. అటవీ శాఖ నూతన కార్యాలయం నిర్మించుట కోసం అవసరమైన స్థలాన్ని గుర్తించి కేటాయించాలని సూచించారు. బందర్ పోర్టు ఎక్స్టెన్షన్ను నాలుగు బ్లాగులుగా విభజించడం జరిగిందని అందులో రెండవ బ్లాక్లో డిఎఫ్ఓ రాజశేఖర్ మాట్లాడుతూ అటవీ శాఖ వద్ద ఉన్న గజట్ రికార్డుల ప్రకారం హార్బర్ వారికి 225 ఎకరాలు ఇచ్చి నట్లు ఉందని, అయితే రెవెన్యూశాఖ కలెక్టర్ గారి ద్వారా పోర్టు వారికి 406 ఎకరాలు ఇచ్చినట్లు వారు చూపిస్తున్నారు ఈ విషయమై రెవెన్యూ, సర్వే, అటవీ శాఖల ద్వారా ఉమ్మడి సర్వే చేయాల్సి ఉందని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకురాగా దీనిపై జిల్లా కలెక్టర్ వెంటనే స్పందిస్తూ ఈ విషయమై సర్వే చేయుటకు కావలసినంత బడ్జెట్ను కేటాయించాలని ప్రతిపాదనలను ప్రధాన ముఖ్య అటవీ సంరక్షకులు, మంగళగిరి వారికి పంపాలన్నారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ శ్రీహరి రావు, డిఆర్ఓ ఎం.వెంకటేశ్వర్లు, డీఎఫ్ఓ కే రాజశేఖర్, ఆర్డిఓ ఐ కిషోర్, సర్వే భూ రికార్డుల ఏడి రంగారావు, మత్స్యశాఖ ఏడి వెంకటేశ్వర్ రెడ్డి, ఎఫ్ఆర్ఓ లు సిహెచ్ సుజాత, షరీఫ్, తహసిల్దార్ శ్రీవిద్య తదితర అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వమే గ్యాస్ సిలిండర్లు సరఫరా చేయాలి

విశాలాంధ్ర-గన్నవరం: ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకం వంటలకు అవసరమైన గ్యాస్ బండలను ప్రభుత్వమే సరఫరా చేయాలని ఆంధ్రప్రదేశ్ మధ్యాహ్న భోజన పథకం వంట కార్మికుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గండికోట సమ్మక్క కోరారు. శుక్రవారం స్థానిక సంఘ కార్యాలయంలో నియోజకవర్గస్థాయి మధ్యాహ్న భోజన పథకం వంట ఏజెన్సీ కార్మికుల సంఘం సమావేశం జరిగింది. దీనికి ఆ సంఘ నాయకురాలు కుమారి అధ్యక్షత వహించారు. సమ్మక్క మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకం నిర్వహణలో తీసుకువచ్చిన మార్పుల వల్ల పిల్లలకు పోషకాలతో కూడిన ఆహారం అందుతుందని, ఇది మంచి పరిణామం అని చెప్పారు. అయితే పిల్లలకు పౌష్టికాహారం వండి పెడుతున్న వంట కార్మికులకు మాత్రం కష్టాలు, నష్టాలు మిగులుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా బడ్జెట్ను పెంచకపోవడం వల్ల అప్పుల పాలు కావాల్సి వచ్చిందని చెప్పారు. దీనికి తోడు నెలవారి బిల్లులు ఇవ్వకపోవడం వల్ల చిల్లర దుకాణాల్లో వేలకు వేలు అప్పులు పేరుకుపోవడంతో కొత్త అప్పులు పుట్టని పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. మరోవైపు పుల్లల పొయ్యి మీద వంట చేయకూడదని గ్యాస్ సిలిండర్లు మాత్రమే వాడాలని నిబంధన పెట్టడంతో ఇది వంట ఏజెన్సీ కార్మికులకు పెద్ద గుదిబండగా మారిందని చెప్పారు. ఏడాదికి 12 బండలు ఇస్తూ ఉండగా ఐస్ కోళ్లలో వంట చేసే వారికి నెలకు 12 బండలు ఖర్చు అవుతున్నాయని తెలిపారు. రెండో నెల నుంచి వంట చేయాలంటే గ్యాస్ బండలు ఇవ్వని పరిస్థితి ఏర్పడిందని వివరించారు. పుల్లల మీద వంట చేయడానికి హెచ్ఎంలు, అధికారులు అంగీకరించడం లేదని అన్నారు. ఈ

పరిస్థితుల్లో ప్రభుత్వమే గ్యాస్ బండలు సరఫరా చేయాలని విన్నవించారు. అదేవిధంగా పెరుగుతున్న నిత్యవసర వస్తువుల ధరలకు అనుగుణంగా ఎంపీపీ స్కూల్లో, ఎంపీయూపీ జిల్లా పరిషత్ హై స్కూళ్ల మెనూ ఛార్జీలు పెంచడంతోపాటు కార్మికులకు గౌరవ వేతనాలు పెంచి నెలవారీగా మంజూరు చేయాలని కోరారు. వంటకు వాడే నిత్యవసర సరుకులు కూడా ప్రభుత్వమే సరఫరా చేస్తే ఏజెన్సీలకు ఏ విధమైన ఇబ్బంది ఉండదని పేర్కొన్నారు. ముఖ్యంగా చాలా కాలంగా పనిచేస్తున్న తమను ప్రభుత్వ కార్మికులుగా గుర్తించాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా నాయకులు కే. వెంకటేశ్వరరావు, మండల నాయకులు మహేష్, వంట ఏజెన్సీ కార్మికుల సంఘం నాయకులు సుందరి, వసుమతి పాల్గొన్నారు.

విద్యుత్ కోతలకు నిరసనగా సీపీఎం ఆందోళన

విశాలాంధ్ర- గంపలగూడెం: కరెంటు కోతలకు నిరసనగా సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళను -ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం మండలం అనుములంక గ్రామానికి చెందిన రైతులు, ప్రజలు సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం గంపలగూడెం విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట ఆందోళన నిర్వహించారు. వేళా పాళా లేకుండా రాత్రి పూట కరెంటు కోతలు విధించటం వల్ల దోమ కాటుతో ప్రజలు విష జ్వరాల బారినపడి అనారోగ్యానికి గురి అవుతున్నారని, రైతులు పంటలకు సకాలంలో తడులు పెట్టలేక పంటలు ఎండి పోతున్నాయని తక్షణమే కరెంటు కోతలు ఎత్తివేసి ప్రజల ఆరోగ్యాన్ని, రైతుల పంటలను కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని స్థానిక విద్యుత్ ఏఈ కోరారు. రైతు సంఘం ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు మద్ది రెడ్డి. వెంకట రెడ్డి, సీపీఎం మండల నాయకులు జానపాటి. వెంకటేశ్వరావు, వేల్పుల. సంజీవరావు, వేల్పుల. పుల్లారావు, యోహాన్, రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

చేయూత లబ్ధిదారులకు అవగాహన సదస్సు

విశాలాంధ్ర-గంపలగూడెం: జగనన్న పాలవెల్లువలో భాగంగా శుక్రవారం గంపలగూడెం మండలంలోని పెనుగొలను-2 సచివాలయ పరిధిలోని రాజవరం, జింకల పాలెం, చల్లగొండ్లవారిపాలెం గ్రామాల వైయస్సార్ చేయూత లబ్ధిదారులకు పెనుగొలను-2 రైతు భరోసా కేంద్రం వద్ద అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. గ్రౌండింగ్ మేళాలో పాడి పశువులు కొనుగోలుదారులకు కృష్ణాజిల్లా సహకార సంస్థ బ్యాంకు ద్వారా రైతులకు పాడి పశువులు కొనుగోలునకు రుణసౌకర్యం కల్పిస్తారు. మండల ప్రత్యేక అధికారి బి. నాగరాజు, మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎర్రమల. పిచ్చిరెడ్డి, పశుసంవర్ధక శాఖ పశు వైద్యులు డి. అభిలాష్, జగనన్న పాల వెల్లువ రూట్ ఇంచార్జ్ స్టాలిన్, కే డి సి సి గంపలగూడెం బ్యాంక్ మేనేజర్ శ్రీనివాస రావు, రాజవరం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షులు చెన్నుపాటి. శేషగిరిరావు, మూడు గ్రామాల చేయూత లబ్ధిదారులు మరియు పాడి రైతులు పాల్గొన్నారు.

జన విజ్ఞానవేదిక అధ్యక్ష, కార్యదర్శుల ఎన్నిక

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: విస్సన్నపేట మండల జన విజ్ఞానవేదిక కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నట్లు సంఘం ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.గంగాధర్ తెలిపారు. మండల అధ్యక్షుడిగా ఎంజీ నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా కె.రామారావు ఎన్నికయ్యారు. సంఘం గౌరవాధ్యక్షునిగా పి.చంద్రశేఖర్, సమతా కన్వీనర్‌గా కె.చైతన్యలు ఎన్నికైనట్లు ఆయన వివరించారు.

సజ్జలను కలిసిన వేమా సురేష్

విశాలాంధ్ర-కంచికచర్ల: ప్రభుత్వ సలహాదారుడు, వైసీపీ పార్టీ సీనియర్ నాయకుడు సజ్జల రామకృష్ణారెడ్డిని విజయవాడలోని వారి నివాసంలో ఎన్టీఆర్ జిల్లా ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్‌కుమార్‌తో మర్యాద పూర్వకంగా కలిసి, నెహ్రూ సెంటర్ నుంచి ప్రొబిషన్ కార్యాలయం వరకు అగి పోయిన రోడ్డు గురించి, పట్టణంలో పలు అభివృద్ధి పనులను గురించి వారికి ఎమ్మెల్సీతో పాటు పట్టణ వైసీపీ అధ్యక్షుడు ఉపసర్పంచ్ వేమా సురేష్ బాబు వివరించారని, దీనికి ఆయన సానుకూలంగా స్పందించారని తెలియజేశారు. వైసీపీ నాయకులు అనుమాల వాసు తదితరులు పాల్గొన్నారు.

పెండ్యాలలో రీసర్వే పై గ్రామ సభ

విశాలాంధ్ర-కంచికచర్ల: కంచికచర్ల మండలం, పెండ్యాల గ్రామం నందలి రీ-సర్వే లో భాగంగా పెండ్యాల గ్రామ సచివాలయం వద్ద గ్రామ సభను నిర్వహించి డ్రాఫ్ట్ ల్యాండ్ రిజిస్టర్‌ను ల్యాండ్ పార్సెల్ నెంబర్ దాఖలా ప్రతి రైతు వివరాలు చదవారు. పెండ్యాల గ్రామ రైతులు పాల్గొన్నారు. సదరు కార్యక్రమంలో షేక్ మలక్ బషీర్ ఎంపీపీ, గ్రామ సర్పంచ్, శ్రీయుత తహసీల్దార్ పి. శంకర బాబు, డిప్యూటీ తహసీల్దార్ రీ-సర్వే, పెండ్యాల గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు. కంచికచర్ల మండలం నందు గల కంచికచర్ల, చేవిటికల్లు, మొగులూరు, వేములపల్లి గ్రామములలో రీ-సర్వే మొదలవుతున్నందున ప్రతి ఒక్క రైతు మీ భూమి పూర్తి వివరములతో గ్రామ రెవిన్యూ అధికారి, గ్రామ సర్వేయర్‌ను సంప్రదించవలసినదిగా కోరారు. కౌలు రైతులందరు వారి భుయజమానులకు విధిగా రీ-సర్వే తెలియజేయాలని, గ్రౌండ్ ట్రూతింగ్ సమయములో రైతులు, పాయకారు రైతులు హాజరు కావాలని కోరారు.

అంగన్వాడీ కేంద్రంలో మానవహారం

విశాలాంధ్ర-పెనుగంచిప్రోలు: మండలంలోని కోన కంచిలో చిలకల్లు ప్రాజెక్ట్ ఐసీడీఎస్ యూ నిట్ అధికారి ఆదేశాల మేరకు సూపర్వైజర్ ఉష ఆధ్వర్యంలో శుక్రవారం టీహెచ్ ఆర్ పంపిణీ చేసి మానవహారం నిర్వహించారు. అంగన్‌వాడీ సిబ్బంది లక్ష్మి, వార్డ్ సభ్యులు అశ్విని, అంగన్వాడి కేంద్రానికి వచ్చే పిల్లల తల్లులు పాల్గొన్నారు.

ఘనంగా చంద్రశేన గుప్తా జయంతి

విశాలాంధ్ర-గంపలగూడెం: వాసవి క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు కల్వకుంట్ల చంద్ర సేన గుప్తా జయంతి శుక్రవారం మండలంలోని ఊటుకూరు వాసవి, వాసవి వనిత క్లబ్స్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. వారి చేసిన సేవలను స్మరించారు. క్లబ్స్ అధ్యక్షుడు నెరేళ్ల శేషగిరిరావు, మైలవరపు శ్రీరమ్య, వి.బాబ్జి, కె.శ్రీనివాసరావు, ఎం జ్యోతి పాల్గొన్నారు.

దుర్గాఘాట్‌లో సిల్ట్ తొలగింపు

విశాలాంధ్ర-విజయవాడ(వన్‌టౌన్): ఇంద్రకీలాద్రి దుర్గాఘాట్‌లోని మరో ఏడు రోజుల్లో సిల్ట్ తొలగిస్తామని ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈవో భ్రమరాంబ తెలిపారు. శుక్రవారం ఘాట్‌లో జరుగుతున్న పనులను పరిశీలించారు. దుర్గఘాట్‌లో ఉన్న సిల్ట్‌ను తొలగించేందుకు పనులు ప్రారంభించినట్లు తెలిపారు. అమ్మవారి భక్తులకు పవిత్ర స్నానం చేసేందుకు మరో 7 రోజుల్లో అందుబాటులో తెస్తామన్నారు. జరుగుతున్న పనులు పరిశీలించి పలు సూచనలు చేశారు. అలాగే దుర్గాఘాట్ వద్ద ఉన్న పలు దుకాణాలను పరిశీలించారు. ఆలయ కార్యనిర్వాహక ఇంజనీరు లింగం రమాదేవి, ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

తల్లి పాలే బిడ్డకు శ్రేయస్కరం

విశాలాంధ్ర-పమిడిముక్కల: తల్లి పాలు బిడ్డకు శ్రేయస్కరమని, రోగనిరోధక శక్తి పెరుగుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ యు ఉష అన్నారు. పామర్రు పరిధిలోని కపిలేశ్వరపురం సెక్టార్‌లోని మంటాడ-ఐదో అంగన్వాడీ కేంద్రంల్లో పోషకాహార మహోత్సవాల్లో భాగంగా బాలింతలు గర్భిణులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ చిన్నారులకు ఆరు నెలల వరకు తల్లిపాలు ఇస్తూ ఎడవ నెల నుంచి ఆహారం అలవాటు చెయ్యాలని తెలిపారు. సర్పంచ్ నందమూడి వీరమ్మ బాలింతలు గర్భిణులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం ఘనత జగన్‌దే

విశాలాంధ్ర-పమిడిముక్కల: వైసీపీ ప్రభుత్వం వచ్చిన నాలుగేళ్లల్లో పేదలకు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన ఘనత జగనన్నదేనని ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ అన్నారు. శుక్రవారం ఐనపూరులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. పార్టీలకతీతంగా పెన్షన్లు గృహాలు రేషన్ కార్డులు వంటి అనేక కార్యక్రమాలు అందరూ సద్వినియోగం చేసుకుంటున్నారని నూతన పెన్షన్లు పంపిణీ చేస్తున్నట్లు కైలే తెలిపారు. విద్యకు. వైద్యానికి, రైతులకు ప్రత్యేక శ్రద్ధతో సీఎం జగన్ నిధులు కేటాయిస్తున్నారని, మనమందరం ముఖ్యమంత్రికే ఓటు వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. ఎంపీపీ కాసాని వేద సుప్రజ మండల వైసీపీ కన్వీనర్ యలమంచిలి గణేష్ బాబు యంపిటిసి ఆదిశేషు పలువురు వైసీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే సహించం

విశాలాంధ్ర-పెదపారుపూడి: శాంతి భద్రతలకు విఘాతం కల్పించిన చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన ఎంతటి వారినైనా సహించేది లేదని పెదపారుపూడి పోలీస్ స్టేషన్ ఎస్సై పల్లా నాగ కళ్యాణి శుక్రవారం అన్నారు. మండలంలోని మహేశ్వర పురం గ్రామంలో మద్యం సేవించి రోడ్లపై దారినే పోతున్న వారిని అసభ్యకరంగా మాట్లాడుతూ రోడ్లపై మంచి, చెడు లేకుండా వీరంగం సృష్టిస్తున్న విషయం కొంతమంది ఫోన్ ద్వారా తెలియజేయడంతో వెంటనే స్పందించిన ఎస్సై గ్రామంలో పర్యటించి రోడ్లపై తిరుగుతున్న ఆకతాయిలకు కౌన్సిలింగ్ రూపంలో తగిన సూచన శుక్రవారం చేశారు. స్థానిక ఎస్సై స్పందించిన తీరును బట్టి గ్రామంలో ఆనందా అభినందనలతో ఎస్సై ను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆ గ్రామ సర్పంచ్ జువ్వనపూడి రాజు, ఏఎస్ఐ, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

విశాలాంధ్ర-గన్నవరం: విద్యుత్ లైన్లు మరమ్మతు నిమిత్తం గన్నవరం సెక్షన్ పరిధిలో 33/11కేవీ కేసరపల్లి సబ్ స్టేషన్ మెయింటినెన్స్ నిమిత్తం సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ గుణదల కార్యనిర్వాహక ఇంజనీర్ పీ హరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. కేసరపల్లి మొత్తం ఏరియా, ఎస్ఎల్‌వి విల్లాస్, అప్పారావుపేట, అర్జెంపూడి, బుద్ధవరం, బూతుమల్లిపాడు, జక్కులనక్కలం, జగనన్న కాలనీ, వీఎస్‌పురం కాలనీ ప్రాంతాల్లో సరఫరా నిలిపి వేస్తామని ఆయన పేర్కొన్నారు. దీనికి అందరూ సహకరించాలని ఆయన కోరారు.

లక్ష్మారెడ్డి సభ జయప్రదం చేయాలి

విశాలాంధ్ర-పెదపారుపూడి: డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు, అనేక అంశాల పోరాటయోధుడు కామ్రేడ్ ఎస్ లక్ష్మారెడ్డి సంస్మరణ సభ గుంటూరు ఆర్సీఎం యూపీ స్కూల్లో ఈనెల 9వ తేదీన ఉదయం 10 గంటలకు జరుగుతుందని డీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రావెళ్ల వరుణ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ప్రస్తుత రాష్ట్ర అధ్యక్షుడు కే నరహరి, ప్రధాన కార్యదర్శి ఎన్వీ రమణయ్య అధ్యక్షత వహిస్తారని పేర్కొన్నారు. రాష్ట్రంలోని ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయవలసినదిగా ఆయన విజ్ఞప్తి చేశారు.

వైఎస్ వర్ధంతి జయప్రదం చేయాలి

విశాలాంధ్ర-పెదపారుపూడి: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి 14వ వర్ధంతి పురస్కరించుకుని సెప్టెంబర్ 2న ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు మండలంలోని వివిధ గ్రామాలో జరుగుతుందని వైసీపీ సేవా విభాగం రాష్ట్ర అధ్యక్షుడు గోళ్ల సోమేశ్వరరావు ఓ ప్రకటనలో తెలిపారు. పెదపారుపూడి చెరువు గట్టు సెంటర్లో పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొననున్న కార్యక్రమాన్ని మండలంలోని వైసీపీ నాయకులకు, కార్యకర్తలు, అభిమానులు జయప్రదం చేయాలని ఆయన కోరారు.

నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్ష

విశాలాంధ్ర-కృత్తివెన్ను: బాలికను అత్యాచారం చేసిన కేసులో నేరం రుజువు కావడంతో బందరు పోక్సో కోర్టు నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్షతోపాటు, రూ.10వేల జరిమానా విధించింది. మండలంలోని దోమలగొంది గ్రామానికి చెందిన పెదసింగు ప్రసాదు, అదే గ్రామానికి చెందిన బాలికపై అత్యాచారం చేసినట్లు బాలిక తల్లిదండ్రులు 2019లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు పూర్తి వివరాలను బందరు పోక్సో కోర్టులో సమర్పించారు. నేరం రుజువు కావడంతో కోర్టు నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్షతో పాటు పదివేల రూపాయలు జరిమానా విధించినట్లు ఎస్ఐ ఏ గణేష్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

150 మందికి నూతన పింఛన్ల పంపిణీ

విశాలాంధ్ర-కృత్తివెన్ను: సీఎం జగన్ ప్రతి ఇంట్లోనూ ఒక పెద్ద కొడుకుగా పెద్ద వాళ్లకి అండగా ఉంటున్నాడని గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. నిడమర్రు పంచాయతీలో నిర్వహించిన ఇంటింటికి మన ప్రభుత్వం కార్యక్రమంలో శుక్రవారం మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ వద్ద నూతనంగా మంజూరైన 150 మందికి పింఛన్లను అందించారు. అనంతరం ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ కార్యక్రమాల గురించి వివరించారు. ఎంపీపీ కూనసాని గరుడ ప్రసాద్, ఏఎంసీ చైర్మన్ కొల్లాటి బాలగంగాధర్ రావు, జడ్పిటిసి సభ్యురాలు మైలా రత్నకుమారి, వైసీపీ కన్వీనర్ వైదాని వెంకటరాజు, పీ మహేష్, కే లక్ష్మోజి, పట్టపు నాగేశ్వరావు, సర్పంచులు పులగం సుబ్రమణ్యం, మంద పాటి ప్రదీప్, ఆకన సాయి, పులగం నరసింహారావు, పట్టపు నాని, పులగం నాయుడు, కొక్కిలిగడ్డ బాపూజీ పాల్గొన్నారు.

పీఎం కిసాన్ పెట్టుబడి సాయం పంపిణీ

విశాలాంధ్ర-మచిలీపట్నం: పేద రైతులకు అండగా నిలబడి పెట్టుబడి సాయం అందించేందుకు వైఎస్సార్ రైతు భరోసా ప్రభుత్వం అమలు చేస్తోందని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి శుక్రవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుండి వైయస్సార్ రైతు భరోసా పిఎం కిసాన్ పథకం కింద భూమిలేని ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ కౌలు రైతులకు పెట్టుబడి సాయం బటన్ నొక్కి వారి ఖాతాలో జమ చేశారు. కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ ఈ కార్యక్రమం వీసీ లో పాల్గొన్నరు. అనంతరం జిల్లాలో వైయస్సార్ రైతు భరోసా- పిఎం కిసాన్ పథకం క్రింద 5వ ఏడాది మొదటి విడతగా 7,462 మంది భూమి లేని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ కౌలు రైతులు మరియు దేవాదాయ భూములు సాగు చేసుకుంటున్న 139 మంది కౌలు రైతులు మొత్తం 7,601 మంది రైతులకు 7,500 చొప్పున పెట్టుబడి సాయంగా మొత్తం 5.70 కోట్ల రూపాయలు, 2023 ఖరీఫ్లో మే నుండి ఆగస్టు వరకు కురిసిన భారి వర్షాలు వరదలకు ఉద్యాన పం టలు దెబ్బతిన్న 211 మంది రైతు లకు రు.21.61 లక్షలు కలెక్టర్ పంపిణీ చేశారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి కమిటీ చైర్మన్ జన్ను రాఘవరావు, కమిటీ సభ్యులు శ్రీకాకుళపు నాగేశ్వరరావు, బందరు నియోజకవర్గ వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ చూడామణి రావు, వ్యవసాయాధికారులు మనోహరరావు, మణిధర్ తదితరులు పాల్గొన్నారు.

సర్టిఫికెట్స్ పోయినవి

చలపాటి బ్లెస్సీ ఇవాంజిలిన్ D/o. ఏలీషాబాబు అను నేను ఘంటశాల మండలం శ్రీకాకుళం గ్రామ నివాసిని ది.29-08-2023న నా 10th మార్క్‌లిస్ట్, డిగ్రీ ప్రొవిజన్ సర్టిఫికెట్స్ జిరాక్స్ కొరకు కొడాలి సెంటరుకు వెళుతుండగా మార్గమధ్యలో పడిపోయినవి. కావున నా సర్టిఫికెట్స్ దొరికిన వారు నా నెంబర్ **9441041760**కు ఫోన్ చేయగలరు.

విశాలాంధ్ర ఎన్టీఆర్ జిల్లా

అటవీ హక్కుల చట్టాన్ని సమగ్రంగా అమలు చేయాలి

విశాలాంధ్ర-విజయవాడ: అటవీ సంపద అభివృద్ధి, పచ్చదనం పెంపుదల, పర్యావరణ పరిరక్షణ, అడవి బిడ్డలైన గిరిజనులకు జీవనోపాధి కల్పించాలనే లక్ష్యాలతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేసిన అటవీ హక్కుల చట్టాన్ని సమగ్రంగా అమలు చేయాలని సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి సీహెచ్.కోటేశ్వరరావు ప్రభుత్వాన్ని, సంబంధిత అధికారులను డిమాండ్ చేశారు. విజయవాడ సీపీఐ జిల్లా కార్యాలయం దాసరి భవన్‌లో శుక్రవారం సీపీఐ విజయవాడ రూరల్ మండల కార్యవర్గ సమావేశం కోటా సాంబశివరావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కోటేశ్వరరావు మాట్లాడుతూ దేశ, రాష్ట్ర రాజకీయ పరిస్థితులను, 'దేశాన్ని కాపాడుకుందాం-రాష్ట్రాన్ని రక్షించుకుందాం' అనే లక్ష్యంతో సీపీఐ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న బస్సు యాత్ర వివరాలను తెలియజేశారు. ఎన్టీఆర్ జిల్లాలో బస్సు యాత్ర ఘనంగా జరిగిన తీరును, అందుకు సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. గిరిపుత్రులకు అటవీ భూములపై హక్కుల కల్పించాలని, 2007లో ప్రభుత్వాలు చేసిన అటవీ హక్కుల చట్టాన్ని అమలు చేయకుండా సంబంధిత అధికారులు, పాలకులు నిర్లక్ష్యం చేస్తుందన్నారని విమర్శించారు. చట్టాన్ని అమలు చేయటంలో చిత్తశుద్ధి కనబర్చనందు వల్ల గిరిజనులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్టీఆర్ జిల్లాలో వేలాది ఎకరాలు ఎస్సీ, ఎస్టీ బీసీ, మైనార్టీ వర్గాల ప్రజలు దశాబ్దాలుగా సాగు చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నారని తెలిపారు. చట్ట పరిధిలో సాగు భూములపై పేదలకు హక్కు కల్పించటంలో దశాబ్దాల తరబడి జాప్యం చేయటం తీవ్రమైన అన్యాయం అన్నారు. ఇప్పటికైన తక్షణ చర్యలు చేపట్టి పేదసాగుదార్లకు పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. మండలం పరిధిలోని ప్రజా సమస్యలపై సీపీఐ విజయవాడ రూరల్ మండల కార్యదర్శి ఉప్పె నరసింహారావు, మండల నాయకులు భూక్యా దేశ్య, తుపాకుల రాయప్ప, కంపా హనుమంతు, భూక్యా ఆమీరా, భాణావతు వెంకటేశ్వరరావు, నందేటి విజయకుమార్ మాట్లాడారు.

ఆహా క్యాంటీన్ ప్రారంభం

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్: పట్టణపేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) సహకారంతో విజయవాడ నగర పాలక సంస్థ పరిధిలోని పటమట మహిళా సమాఖ్య ఏపీ ఐఐసీ కాలని రైతు బజార్ వద్ద ఏర్పాటు చేసిన ఆహా క్యాంటిన్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా నగర మేయర్ ఆర్.భాగ్యలక్ష్మి, తూర్పు నియోజకవర్గం వైసీపీ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరోగ్యకరమైన ఇంటి తరహా ఆహార పదార్ధాలను పేదలకు అందుబాటు ధరల్లో అందించేందుకు ఆహా క్యాంటీన్ ప్రారంభించినట్లు తెలిపారు. రద్దీ ప్రాంతాల్లో ప్రజలకు ఆరోగ్యకరమైన ఆహారంతో పాటు మహిళలకు జీవనోపాధి కల్పించడమే లక్ష్యంగా ఆహ క్యాంటిన్ పనిచేస్తుందన్నారు. ఆహా క్యాంటిన్‌లో వివిధ రకాల టిఫిన్స్, వేజిటేబుల్ బిర్యానీ, దద్దోజనం, పులిహోర, సాంబార్ అన్నం వంటి పదార్థాలు స్వయం సహాయక సంఘ మహిళలచే ఇంటి వద్ద తయారు చేయించి ఇక్కడ అమ్మకానికి ఉంచినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి హాజరైన అతిథులు ఆహా క్యాంటీన్‌లో ఆహార పదార్ధాలను రుచి చూశారు. ఈ కార్యక్రమంలో నగర డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, యూసీడీ పీవో, వీఎంసీ అడిషినల్ కమిషనర్ శకుంతల, సర్కిల్ ఉమామహేశ్వరి, మెప్మా డీఎంసీ సిహెచ్.మహాలక్ష్మి, 11, 10 డివిజన్ల వైసీపీ ఇన్‌చార్జులు పవనకుమార్, హరీష్, పటమట మహిళా సమాఖ్య అఫీస్ బేరర్స్, మెప్మా సిబ్బంది, స్వయం సహాయక సంఘ మహిళలు, రిసోర్స్ పర్సన్‌లు పాల్గొన్నారు.

ప్రజాసేవలో దాతల సాయం అభినందనీయం

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): ప్రజా సేవలో దాతల సాయం అభినందనీయమని సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. శుక్రవారం మదర్ థెరిస్సా జయంతిని పురస్కరించుకుని అంజలి లయన్స్ క్లబ్, ఎక్స్‌రే సంస్థల ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మల్లాది విష్ణు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రార్థించే పెదవుల కన్నా సాయం చేతులే మిన్న .. అని ప్రపంచానికి చాటిచెప్పిన మనవాతామూర్తి మధర్ థెరిస్సా. ఆమె జీవితాంతం ఇతరులకు సేవ చేసేందుకే వెచ్చించారన్నారు. మానవ సేవే, మాధవ సేవగా భావించి ఎన్నో సేవ కార్యక్రమాలు చేశారన్నారు. ఆమె స్ఫూర్తితో ఎంతో మంది మహనీయులు సేవా కార్యక్రమాలు చేస్తూ పలువురికి ఆదర్శంగా నిలస్తున్నారన్నారు. అంజలి క్లబ్ అధ్యక్షులు వై.సుధాకర్ బాబు, కొల్లూరి సమక్షంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. డాక్టర్ బ్రహ్మదేశం వసంతకుమార్, దుర్గా తేజ, అధ్యక్షులు డీ.లక్ష్మీకుమారిల సహకారంతో కుట్టు మిషన్, సైకిల్‌ను పంపిణీ చేశారు. దాతలకు అభిందించారు. అనంతరం వివిధ రంగాల్లో సేవా కార్యక్రమాలు చేస్తున్న పలువురికి ప్రతిష్టాత్మక మధర్ థెరిస్సా అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏపీ ఐడీసీ ఛైర్మన్ బండీ పుణ్యశీల, బోడి ఆంజనేయరాజు, గుర్రం ఏడు కొండలు, కొండాయ గుంట రాము, సర్వేశ్వరరావు, కొనకళ్ళ విద్యాధరరావు, తదతదితరులు పాల్గొన్నారు.

వెహికల్ డిపో, గాంధీహిల్ తనిఖీ

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్: హనుమాన్‌పేట వెహికల్ డిపో ఆధునీకరణ పనుల పురోగతిని శుక్రవారం నగర పాలక సంస్థ కమీషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పరిశీలించారు. డిపోలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది వివరాలు, మూవ్‌మెంట్ రిజిస్టర్, ఇతర రిజిస్టర్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా వాహనాల సర్వీసింగ్ చేసే ప్రాంతంలో మట్టి, అపరిశుభ్రంగా ఉండటంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్వీస్ పాయింట్ వద్ద డస్ట్‌బిన్ ఏర్పాటు చేసి వాహనాలు సర్వీస్ చేసిన వెంటనే వచ్చే వ్యర్ధాలను డస్ట్‌బిన్‌లో వేయాలని సిబ్బందిని ఆదేశించారు. వెహికల్ డిపో పక్కన ఉన్న రైవస్ కాలవను పరిశీలించిన ఆయన గ్యాంగ్ వర్కర్‌లను ఏర్పాటు చేసి కాలువ ఒడ్డున పేరుకుపోయే చెత్త, వ్యర్ధాలను ఎప్పటికప్పుడు పూర్తి స్థాయిలో తొలగించి పరిసరాలన్నీ పరిశుభ్రగా ఉండేలా చూడాలని చీఫ్ మెడికల్ అధికారిని ఆదేశించారు. హనుమాన్‌పేట లోని పలు అంతర్గత రోడ్లులో పారిశుధ్య నిర్వహణ, డ్రెయిన్లలో మురుగునీటి పారుదల విధానాన్ని పరిశీలించి వీధులు అన్నియు పరిశుభ్రంగా తీర్చిదిద్దాలని, డ్రెయిన్‌లో మురుగునీటి పారుదలకు అవరోధకరంగా ఉన్న చెత్త, వ్యర్ధాలను తొలగించి మురుగునీరు సక్రమంగా ప్రవహించేలా చూడాలని ఆదేశించారు. అనంతరం 53వ డివిజన్ కొత్తపేటలోని గాంధీహిల్‌ను పర్యాటక ప్రదేశంగా రూపొందించటంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. నగరానికే తలమానికమైన గాంధీహిల్‌ను అభివృద్ధి చేసి పిన్నల నుండి పెద్దల వరకు ఆహ్లాదాన్ని అందించేలా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గాంధీహిల్ కాంపౌండ్ వాల్, కొండపైకి వెళ్లు దారిలోని వాల్ తగిన మరమ్మత్తులు నిర్వహించటంతో పాటు మెట్ల మార్గానికి ఇరువైపులా చెట్ల కొమ్మలను ట్రిమ్మింగ్ చేయాలని సూచిస్తూ, పెరిగిన చెట్ల గుబురు తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దాలని ఆదేశించారు. ఈ పర్యటనలో డీసీపీ జుబిన్ శిరన్‌రాయ్, ఈఈ సత్యనారాయణ పాల్గొన్నారు.

కీసర గ్రామ సచివాలయ భవనం ప్రారంభం

విశాలాంధ్ర-కంచికచర్ల: కంచికచర్ల మండలంలోని కీసర గ్రామంలో రూ.40 లక్షల అంచనా వ్యయంతో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని శాసనసభ్యులు డాక్టర్ మొండితోక జగన్ మోహన్ రావు గారు శుక్రవారం ప్రారంభించారు. ముందుగా స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి నవరత్నాల ద్వారా గ్రామంలోని ప్రతి ఇంటికి అమ్మ ఒడి, చేయూత, విద్యాదీవేన, జగనన్న విద్యా కానుక, జగనన్న చేదోడు, వివిధ రకాల పెన్షన్లు వంటి వివిధ సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి చేరేలా ప్రభుత్వం ప్రతి గ్రామంలో సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి, ప్రతి 50 ఇళ్లకు ఒక వాలంటీర్ ద్వారా ఇంటికి లబ్ధి చేకూరేలా కృషి చేస్తుందన్నారు. గత ప్రభుత్వం ప్రజలకు ఏమి చేయకపోగా జన్మభూమి కమిటీల పేరుతో ఆఫీసుల చుట్టూ, నాయకుల చుట్టూ ప్రజలను తిప్పుకున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి పాదయాత్ర చేస్తున్న సమయంలో ప్రజల కష్టాలను తెలుసుకొని చేస్తానని ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తూ ప్రజల గుండెల్లో మంచి స్థానం సంపాదించుకున్నారని చెప్పారు. కావున 2024 ఎన్నికల్లో వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వాన్ని భారీ మెజార్టీతో గెలిపించేందుకు ప్రజల సిద్ధంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సచివాలయాల ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్: బడిఈడు పిల్లలందరూ తప్పనిసరిగా పాఠశాలల్లో చేరేలా చర్యలు తీసుకోవాలని నగర పాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఎడ్యుకేషన్ కార్యదర్శులను, సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. స్థానిక 41వ డివిజన్ భవానిపురంలోని 128, 129 కేదారేశ్వరపేట 239వ సచివాలయలను కమిషనర్ శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. నగరంలో బడి ఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్చే కార్యక్రమం గ్రాస్ ఎన్రోల్మెంట్ రేషియో సర్వేపై ప్రత్యేక దృష్టి సారించి, సూచించిన యాక్షన్ ప్లాన్‌ను అమలు చేయాలన్నారు. నగరంలోని ప్రతి సచివాలయంలో ఐదేళ్ల నుండి 18 ఏళ్లలోపు పిల్లలు ఎవరైతే బడికి వెళ్ళని వారి వివరాలను వలంటీర్ల ద్వారా ఎడ్యుకేషన్ కార్యదర్శులు సేకరించాలని నోడల్ అధికారులను ఆదేశించారు. విద్యాశాఖ నుండి ప్రత్యేకంగా సీఆర్పీలు, అధికారులు నగర పాలక సంస్థ నోడల్ అధికారులతో సమన్వయం చేసుకోవాలన్నారు. పిల్లల్లో అసలు బడికి వెళ్లనివారు, డ్రాప్ అవుట్స్‌ను వేరుగా వివరాలు తీసుకొని చైల్డ్ ఇన్ఫోలో అప్‌లోడ్ చేయాలన్నారు. నగరంలో బడికి వెళ్ళని వారిలో ర్యాట్ పికర్స్ పిల్లలు, వలసలు వచ్చిన వారి పిల్లలపై నోడల్ అధికారులు, డిప్యూటీ కమిషనర్లు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పిల్లల సర్వే పూర్తి చేసి నోడల్ అధికారుల వారిగా కార్యాచరణ ప్రణాళిక తయారు చేసుకొని, రోజువారీ నివేదిక ఇవ్వాలన్నారు. నగరంలో ఏ ఒక్కరూ బడి ఈడు పిల్లలు బడి భయట ఉండరాదని తెలిపారు. అనంతరం సచివాలయాల్లోని ఇనస్పెక్షన్, హాజరు, స్పందన రిజిష్టర్లు, నోటీసు బోర్డుతో పాటు వివిధ సంక్షేమ పథకాల రికార్డులను పరిశీలించారు. సచివాలయం పరిధిలో నిర్దేశించిన కార్యక్రమాల్లో ఎలాంటి పెండింగులు ఉంచరాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే సచివాలయ కార్యదర్శులు, వలంటీర్లకు షో కాజ్ నోటీసులు జారీ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

ఆదర్శనీయులు టి.కృష్ణ

విశాలాంధ్ర-విజయవాడ: ప్రముఖ దర్శకులు, అభ్యుదయ వాది ఆదర్శనీయులని సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు అన్నారు. టి.కృష్ణ 73వ జయంతి సందర్భంగా టి.కృష్ణ సాంస్కృతిక కళా పీఠం ఆధ్వర్యంలో నిర్మల హృదయ భవన్‌లో అనాథ పేదలకు అన్నదాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి గౌరవ అతిథిగా ఆయన పాల్గొని ప్రసంగించారు. అనంతరం వద్దులకు అన్నం వడ్డించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర సహాయ కార్యదర్శి నక్క వీరభద్రరావు, ప్రజానాట్యమండలి నగర అధ్యక్షులు ఎస్కే.నజీర్, టీ.కృష్ణ సాంస్కృతిక కళా పీఠం అధ్యక్షులు మారపాక రాంబాబు, ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి సురేష్, పార్టీ నాయకులు సింగరాజు సాంబశివరావు తదితరులు. ముందుగా టి.కృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అర్హులైన రైతులకు రైతు భరోసా, పీఎం కిసాన్ లబ్ది

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక): సొంత భూమి సాగుచేసుకుంటున్న రైతులతో పాటు వ్యవసాయ భూమి లేని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, కౌలు రైతులు, అటవీ, దేవాదాయ భూములు సాగుచేసుకుంటున్న రైతులకు వైఎస్సార్ రైతు భరోసా ద్వారా ఐదో ఏడాది మొదటి విడతలో 9,929 మంది రైతులకు రూ.7,44,67,500 ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు తెలిపారు. స్థానిక కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ శుక్రవారం జిల్లాలోని రైతులకు వైఎస్సార్ రైతు భరోసా, పెట్టుబడి రాయితీ చెక్కులను అందజేశారు. నగర డిప్యూటీ మేయర్ శ్రీశైలజారెడ్డి, అగ్రికల్చరల్ జేడీ నాగమణెమ్మ, జిల్లా ఉద్యాన శాఖాధికారి బాలాజీకుమార్, జిల్లా వ్యవసాయాధికారులు రత్నశ్రీ, స్వప్న, ఊర్మిళ, అనితా భాను పాల్గొన్నారు.

నిష్పక్షపాత, పారదర్శక ఓటర్ల జాబితా సిద్ధం చేయాలి

ఓటరు జాబితాలో తొలగించిన ఓటర్లను పునపరిశీలించి నిష్పక్షపాత పారదర్శక ఓటర్ల జాబితా సిద్ధం చేయాలని కలెక్టర్ ఎస్.డిల్లీరావు అధికారులను ఆదేశించారు. స్పెషల్ సమరి రివిజన్-2024లో భాగంగా ఓటరు జాబితలో తొలగించిన ఓటర్లను పరిశీలనను శుక్రవారం కలెక్టర్ పరిశీలించారు. తొలత తూర్పు నియోజకవర్గం పటమట 285 పోలింగ్‌స్టేషన్ పరిధిలో గృహాలను, అనంతరం సెంట్రల్ నియోజకవర్గం అజిత్‌సింగ్ నగర్ పోలింగ్ స్టేషన్ 11 పరిధిలో ఓటర్ల జాబితాతో వారి ఇంటి వద్దె పరిశీలించారు. ఈ ప్రక్రియను సెప్టెంబర్ 7వ తేదిలోపు పూర్తి చేసి ఎన్నికల సంఘానికి నివేధికను సమర్పించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారులు వెంకటరామయ్య, మాధురి, ఎన్నికల డిప్యూటీ తహాశీల్దార్ రవీంద్రనాథ్, సూపర్‌వైజర్ వందనబాబు, బీఎల్‌వో నరేంద్ర పాల్గొన్నారు.

చిత్తశుద్ధితో పనిచేస్తేనే అభివృద్ధి

విశాలాంధ్ర- విజయవాడ (గాంధీనగర్): ఉద్యోగులు చిత్తశుద్ధితో అవినీతికి వ్యతిరేకంగా పనిచేసినప్పుడే ఏసంస్థ అయినా పూర్తి సామర్థ్యాన్ని సాధించగలదని విజయవాడ డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ నరేంద్ర ఎ. పాటిల్ అన్నారు. విజయవాడ డివిజన్‌లో ప్రివెంటివ్ విజిలెన్స్ ప్రచారాన్ని ప్రారంభించారు. దానిలో భాగంగా శుక్రవారం డివిజనల్ కార్యాలయంలో ప్రజా ప్రయోజనాల వెల్లడి, ఇన్‌ఫార్మర్ల రక్షణ (పిఐడిపిఐ) రిజల్యూషన్‌పై అవగాహన పోస్టర్‌ను డిఆర్‌ఎం అవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వేలో అవినీతికి వ్యతిరేకంగా పోరాడటానికి-పారదర్శకతతో కూడిన పటిష్టమైన వ్యవస్థను స్థాపించడానికి ప్రివెంటివ్ విజిలెన్స్ ప్రచారాన్ని ప్రారంభించింది.విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్ 2023కి నాందిగా డివిజన్‌లో 3 నెలల ప్రచారాన్ని చేపట్టిందన్నారు.సెంట్రల్ విజిలెన్స్ కమీషన్ ప్రతి ఏడాది సర్దార్ వల్లభాయ్ పటేల్ పుట్టినరోజు అయిన అక్టోబర్ 30 నుండి నవంబర్ 05 వరకు విజిలెన్స్ అవగాహన వారాన్ని పాటిస్తుంది . సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ (సివిసి) ఆదేశాల మేరకు విజయవాడ డివిజన్‌లో 3 నెలల పాటు డివిజన్ వ్యాప్తంగా వివిధ ప్రివెంటివ్ విజిలెన్స్ కార్యకలాపాలు చేపట్టనున్నారు. ఈ ప్రివెంటివ్ విజిలెన్స్ క్యాంపెయిన్ ప్రధాన ఉద్దేశం ప్రజా పాలనలో సమగ్రతను నిలబెట్టడానికి ఉద్యోగుల నిబద్ధతను పునరుద్ఘాటించడం అన్నారు. సీనియర్ డిపిఓ ఎం. బాల మురలీధర్, డివిజన్ పిఆర్‌ఓ నుస్రత్ ఎం మండ్రుప్కర్,సిబ్బంది పాల్గొన్నారు.

జీపీఎస్ వద్దు... ఓపీఎస్ మాత్రమే కావాలి

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లోనే సీపీఎస్‌ను రద్దు చేస్తామని ఇచ్చిన హామీ నాలున్నరేళ్లైనా కార్యరూపం దాల్చకపోగా ఉద్యోగులకు తీవ్రమైన అన్యాయం జరిగే జీపీఎస్ అమలు చేస్తామని చెప్పటం దుర్మార్గం దీనికి నిరసనగా నేడు రాష్ట్రవ్యాప్తంగా నల్లబ్యాడ్జీలు ధరించి సీపీఎస్ ఉద్యోగుల నిరసన తెలుపుతున్నారని ఏపీసీపీఎస్ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.అప్పలరాజు తెలిపారు. శుక్రవారం గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ ఇస్తామని మొదటి అసెంబ్లీలో ప్రకటించి మోసం చేయటం దారుణం అన్నారు. సీపీఎస్ ఉద్యోగులకు అన్యాయమైన గుదిబండ లాంటి సీపీఎస్ తీసుకొచ్చారన్నారు.దీనికి వ్యతిరేకంగా ఉద్యమిస్తున్న ఉద్యోగులను పలుమార్లు నిర్బంధించి భయభ్రాంతులకు గురిచేయటమే కాకుండా అన్ని జిల్లాల్లో సీపీఎస్ ఉద్యోగులపై కేసులు నమోదు చేసారన్నారు.సీపీఎస్ కంటే దారుణమైన జీపీఎస్ తెచ్చారు .సీపీఎస్ ఆర్డినెన్స్ లో ఏముందో మాకు చెప్పాలని డిమాండ్ చేశారు.జీపీఎస్ పేరుతో తమను మాయ చేయద్దు,మభ్య పెట్టద్దు అన్నారు. పెద్ద పెద్ద సభలు ఎందుకు పెడుతున్నారు. జెఏసీలు అన్నీ రాజకీయ ప్రస్థానానికి మెట్లుగా వాడుకుంటున్నారు అని వ్యంగ్యగా అన్నారు. ఉద్యోగులు,ఉపాధ్యాయుల మీద ఉన్న కేసులు బేషరుతుగా ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సీపీఎస్ అవగాహన ఉన్న ఉద్యోగులందరూ మాతోనే ఉన్నారు. జీపీఎస్ అమలు చేస్తే ప్రభుత్వ పెద్దలు బాధపడాల్సి వస్తుంది అని హెచ్చరించారు. కరిమి రాజేశ్వరరావు, కె.రాంప్రసాద్ పాల్గొన్నారు.

చేపల చెరువులకు వీడని గ్రహణం

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: విస్సన్నపేట పంచాయతీలోని చెరువుల్లో చేపల వేట కోసం ఏర్పాటు చేసిన వేలం పాటలకు వీడని గ్రహణం పట్టింది. ఇప్పటికే పలుమార్లు వాయిదా పడిన ఈ వేలంపాటలను అధికారులు గురువారం సాయంత్రం నిర్వహిస్తామంటూ మైక్ ద్వారా ప్రచారం చేసి వేలంపాటల ఏర్పాటుకు రంగం సిద్ధం చేసినా, పలు వివాదాల కారణంగా ఈ కార్యక్రమం వాయిదా పడింది. వివరాల్లోకి వెళితే...పంచాయతీ పరిధిలో మొత్తం ఆరు చెరువులు ఉండగా, వీటిలో ఒక చెరువును రజక వృత్తిదారుల సహకారసంఘానికి వేలంతో సంబంధం లేకుండా అప్పగించాల్సి ఉంది. మిగిలిన చెరువులకు సంబంధించిన వేలంపాట రెండేళ్ల క్రితం నిర్వహించాల్సి ఉన్నా, నాటి నుంచి వాయిదా పడుతూ, గురువారం తుదిదశకు చేరింది. అప్పటికే ఈ వ్యవహారంలో అధికారపార్టీ అవినీతికి పాల్పడుతోందంటూ విపక్షాలు పెద్దఎత్తున నిరసన వ్యక్తం చేశాయి. ఎట్టకేలకు చెరువుల్లోని ఒక్క తెలికలకుంట చెరువుకు మాత్రమే వేలం నిర్వహించి, మిగిలిన చెరువుల వేలం వాయిదా వేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. ఈ విషయమై ప్రతిపక్ష పార్టీల నుంచి పలు విమర్శలు వినిపిస్తున్నాయి. గతంలో ఏడాదికి రూ.5వేలకు మించని తెలికలకుంట చెరువును అధికారులు కనీసం రూ.1.25లకు మించి వస్తే తప్ప ఒప్పుకోమని, వేలం వాయిదా వేస్తామంటూ బెదిరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతమ్మకుంట చెరువును గతంలో రూ.10లక్షలకు వేలం ద్వారా హక్కులు దక్కించుకున్న వ్యక్తి దాన్ని వదలివేస్తే, రహస్యంగా రూ.2లక్షలకు అధికారపార్టీ నేతలకు కట్టబెట్టిన అధికారులు, తాజాగా రూ.5లక్షలకు మించి వేలం ద్వారా చెల్లించేందుకు కక్షిదారులు ముందుకొచ్చినా ఒప్పుకోకుండా వాయిదా వేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మరికొద్దిరోజుల్లో ఈ వేలంపాటలను పూర్తి చేసి, కక్షిదారులకు హక్కులు కల్పిస్తామని అధికారులు తెలిపారు.

అమ్రితసాయిలో ఇంజనీరింగ్ ఇండక్షన్ ప్రోగ్రాం

విశాలాంధ్ర-కంచికచర్ల: అమ్రిత సాయి ఇంజనీరింగ్ కళాశాలలో 2023లో ఇంజనీరింగ్ చేరిన విద్యార్థులకు మొదటి సంవత్సరం తరగతులు ప్రారంభించామని ప్రిన్సిపాల్ డా॥ యమ్.శశిధర్ తెలిపారు. విద్యార్థులకు, తల్లితండ్రులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సెక్రటరీ&కరస్పాండెంట్ కె. రామ్మోహనరావు మాట్లాడుతూ ఇంజనీరింగ్ చేరిన విద్యార్థులు మొదటి సంవత్సరం నుంచే, మంచి ప్రణాళికతో పాటు లక్ష్యం ఏర్పాటు చేసుకోవాలని, దానికి అనుగుణంగా నిరంతరం కృషి చేయాలని తెలిపారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు అమ్రిత సాయి సరైన వేదిక అని, గవర్నమెంట్ అఫ్ ఇండియా స్వయం ప్రోగ్రామ్స్, సర్టిఫికేషన్ ప్రోగ్రామ్స్‌తో విద్యార్థులు జాబ్ ఓరియెంటెడ్ స్కిల్స్, కళాశాలలో ఉన్న అధునాతన ప్రయోగశాలల ద్వారా సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవాలని తద్వారా విజయం సాధించవచ్చునని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ డాక్టర్ ఎం. శ్రీదేవి, సైన్స్ %ఒ% హ్యుమానిటీస్ విభాగాధిపతి డి. పవన్ కుమార్ మరియు అన్ని విభాగాల అధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

వక్ఫ్ బోర్డ్ డైరెక్టర్ పదవికి ఖాజా నామినేషన్

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): ముతావల్లి కోటాలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వక్ఫ్ బోర్డ్ డైరెక్టర్ పదవికి ఈ నెల 9వ తేదీన జరగనున్న ఎన్నికలకు మాజీ డైరెక్టర్ షేక్ ఖాజా శుక్రవారం నామి నేషన్ దాఖలు చేశారు. తాడేపల్లిలోని లక్కీ ఉస్మాన్ మసీదులో జుమా నమాజ్ అనంతరం సమీపంలోని మైనారిటీ శాఖ కమిషనర్ కార్యాలయం వరకు పాదయాత్రగా వెళ్లి ఎన్నికల అధికారికి నామినేషన్ పత్రాలు అందజేశారు. ఖాజా వెంట ఎమ్మెల్యేలు వెలంపల్లి శ్రీనివాసరావు, మల్లాది విష్ణు, ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, వైసీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జ్ దేవినేని అవినాష్, పలువురు మైనారిటీ నాయకులు, ఉమ్మడి కృష్ణా జిల్లాకు చెందిన ముతావల్లిలు పాల్గొని ఖాజాకు అభినందనలు తెలిపారు. ఈ ఎన్నికల్లో ఖాజా గెలుపొందాలని ఆకాంక్షించారు. ఎన్టీఆర్ జిల్లా నల్ల కుంట దర్గాకు ముతావల్లిగా ఉన్న ఖాజా గతంలోనూ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు.

రిజిస్ట్రేషన్ మేళా సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్: ఏపీ ప్రభుత్వ ఉత్తర్వులు మేరకు నగర పాలక సంస్థ నిర్వహిస్తోన్న రిజిస్ట్రేషన్ ప్రక్రియలో భాగంగా న్యూరాజరాజేశ్వరిపేట, వాంబే కాలనీ ప్రాంతాల్లో ప్రభుత్వం ఎలాట్‌మెంట్ చేసిన పదేళ్ళ క్రితం కొనుగోలు చేసిన ఎలాట్‌మెంట్, నాన్‌ఎలాట్‌మెంట్ దారులకు రిజిస్ట్రేషన్ చేయనున్నట్లు నగర పాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ రిజిస్ట్రేషన్‌కు చదరపు గజానికి రూ.100 చొప్పున 40 చదరపు గజాలకు రూ.4వేలు, రిజిస్ట్రేషన్ చార్జీలు రూ.860 చెల్లించాలని తెలిపారు. ఇందుకు ఒరిజినల్ ఎలాటమెంట్ పట్టా, నాన్ ఎలాట్ దారులైతే వారి పేరున ఉన్న ఒరిజినల్ విక్రయ అగ్రిమెంట్ డాక్యుమెంట్లు(లింగులతో సహా), నోటరీ అఫిడవిత్, ప్రస్తుతం చెల్లించిన ఇంటి పన్ను, నీటి పన్నుల రసీదులు, ఆధార్ కార్డు నకలు, ఇద్దరు సాక్షుల ఆధార్ కార్డు నకళ్ళు అందజేయాలని తెలిపారు. ఈనెల 4వ తేదీ నుంచి న్యూరాజరాజేశ్వరిపేటలోని 233 సచివాలయం, వాంబేకాలనీ, డీ బ్లాక్‌లోని కమ్యూనిటీ హాలులో జరిగే రిజిస్ట్రేషన్ మేళాలో పాల్గొని ఆయా డాక్యుమెంట్లు అందజేయాలని తెలిపారు. ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నగరంలో మెగా అదాలత్ నిర్వహించండి

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్: నగరంలోని అన్ని డివిజన్లలో మెగా అదాలత్ కార్యక్రమాన్ని తిరిగి నిర్వహిచాలని కోరుతూ మాజీ కార్పొరేటర్ పిల్ల లక్ష్మీతులసి నగర మేయర్ ఆర్.భాగ్యలక్ష్మి, నగర పాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు శుక్రవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మధురానగర్ రైల్వేబిడ్జి దిగువన పనులను ప్రారంభించినందుకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తాను పాత 45వ డివిజన్ కార్పొరేటర్‌గా ఉన్న సమయంలో ఆనాటి వీఎంసీ కమిషనర్ నటరాజన్ గుల్జార్ ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగకుండా అధికారులే ప్రజల వద్దకు వచ్చి సమస్యలు పరిష్కరించటంతో పాటు అవినీతిలేకుండా కార్పొరేషన్‌కు కోట్లాది రూపాయిల ఆదాయాన్ని తీసుకువచ్చారన్నారు. అప్పట్లో ఒక్క 45వ డివిజన్‌లోనే రూ.కోటికిపైగా ఆదాయం వచ్చేదని, డివిజన్‌లో ఇంటి పన్నులు, పన్నులు పేరుమార్పు, జనన మరణ ధృవీకరణ పత్రాలు, మంచినీటి కుళాయి, డ్రెయినేజీ కనెక్షన్లు వంటి అనేక సమస్యలు పరిష్కారం అయ్యేవన్నారు. అప్పట్లో నిర్వహించిన అదాలత్ కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన లభించిందని గుర్తు చేశారు. తిరిగి మెగా అదాలత్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టి ఆదాయంతో పాటు ప్రజా సమస్యలు పరిష్కరించాలని సూచించారు. దీనిపై స్పందించిన కమిషనర్ సానుకూలంగా స్పందిస్తూ పరిశీలిస్తామని తెలిపారు.

పింఛన్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే, మేయర్

విశాలాంధ్ర-విజయవాడకార్పొరేషన్: స్థానిక 46, 50, 52వ డివిజన్లలోని 175 సచివాలయంలోని బ్రాహ్మణి వీధిలో శుక్రవారం ఏర్పాటు చేసిన కొత్త పెన్షన్ పంపిణిలో ఎమ్మెల్యే వీ.శ్రీనివాసరావు, నగర మేయర్ ఆర్.భాగ్యలక్ష్మి పాల్గొని లబ్ధిదారులకు పెన్షన్లు పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ పశ్చిమ నియోజకవర్గంలో 562 మందికి కొత్తగా పెన్షన్ మంజూరయినట్లు తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి పెన్షన్ అందించాలనే లక్ష్యంగా జగనన్న ప్రభుత్వం సచివాలయాల వ్యవస్థ ద్వారా కులాలు, పార్టీలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి 1వ తారీఖునే వార్డ్ వలెంటరీల ద్వారా నేరుగా లబ్దిదారుల ఇంటి వద్దేనే పెన్షన్ అందిస్తున్నట్లు తెలిపారు. 60 ఏళ్ళు పైబడిన వారందరికి రూ.2,750 అంది స్తున్నట్లు తెలిపారు. వీఎంసీ అడిషినల్ కమిషనర్, యూసీడీ పీవో శకుంతల మాట్లా డుతూ నగర పాలక సంస్థ మూడు సర్కిల్ కార్యాలయాల పరిధిలో మొత్తం 1702 మందికి కొత్తగా పెన్షన్లు మంజూరయ్యాయని, ఇంకా అర్హులైన వృద్ధాప్య, వితంతు, వికలాంగుల వంటి పెన్షన్లను మంజూరు చేయటం జరుగుతుందని, అర్హత ఉండి పెన్షన్ అందని వారు నేరుగా వారి పరిధిలోని సచివాలయానికి వెళ్లి అర్జి సమర్పించిన యెడల పరిశీలించి పెన్షన్ మంజూరు చేయటం జరుగుతుందని తెలిపారు. కార్పొరేటర్లు సత్యబాబు, పూర్ణచంద్రరావు, వైసీపీ ప్రతినిధులు, నగర పాలక సంస్థ అధికారులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

మహాలక్ష్మి ఆలయం కిటకిట

విశాలాంధ్ర- కంచికచర్ల: స్థానిక శ్రీ మహాలక్ష్మి అమ్మ వారి ఆలయంలో శ్రావణ మాసం మూడో శ్రావణ శుక్రవారం సందర్భంగా అమ్మవారికి విశేష కుంకుమార్చనలు అర్చనలు అభిషే కాలు పూజలు నిర్వహించినట్లు ఆలయ ప్రధాన అర్చకులు కాకాని పవన్ కుమార్ బాబీ తెలిపారు. ఆలయంలో పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి, అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించి, అమ్మవారి ఆశీస్సులు పొందారు. అమ్మవారి సేవ చేయుస్తున్న వారు కంచికచర్ల మాజీ సర్పంచ్ కాలవ సీతారామయ్య కుమారుడు కాలవ జనార్ధన్ దంపతులు, ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్మోహనరావు, ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్ కుమార్‌లు పాల్గొని ప్రభ బండికి కొబ్బరి కాయ కొట్టి అమ్మవారి ప్రభ బండి ప్రారంభించారు. శుక్రవారం ఉదయం అమ్మ వారి ఆలయంలో మామిడితోరణాలు కట్టి, మేళా తాళాలతో అమ్మ వారికి బియ్యం ఇచ్చారు. ఈ కార్యక్రమాలో అందురు పాల్గొన్నాలని కాలవ నాగేశ్వరరావు, కాలవ వాసుదేవరావు కాలవ జనార్ధన్ కాలవ పెద్ద బాబు తెలియజేశారు.

IN THE COURT OF THE HON'BLE I ADDITIONAL SENIOR CIVIL JUDGE, VIJAYAWADA
O.S. NO. 622/2011

Between:
1. Miriyala Vijaya Bhanu
2. Marrapu Samba Siva Rao - Plaintiffs
And
Alapati Jagannadham - Defendant

To:
The plaintiff No. 2
Marrapu Samba Siva Rao,
S/o Simhachalam, Hindu, 35 years, D.No: 74-12-2/9D, Patama, Vijayawada Krishna District.

పై నెంబరు దావాలోని 2వ వాదికి శ్రీ కోర్టువారు సబ్ స్టిట్యూట్ సర్వీసు ద్వారా ప్రతివాది యొక్క writt en statement తీసుకొను నిమిత్తం నోటీసులు జారీచేసి యున్నారు. కావున సదరు 2వ వాది ది.05-09-2023వ తేది ఉదయం గం. 10.30 ని.లకు పై చెప్పిన కోర్టులో స్వయంగా గాని, ప్లీడరు ద్వారా గానీ హాజరై ఆక్షేపణలు వున్న యెడల తెలుపుకొనవలెను. లేనిచో మీ పరోక్షమున తీర్మానించబడునని శ్రీ కోర్టు వారి ఉత్తర్వులతో తెలియపరచడమైనది.

By order of the court

Sri. M. Samba Siva Rao.
Smt. M.V.L. Gopi Ratnam,
Sri. M. Koti Nagaiah, Advocates,
D.No: 27-30-7, Akulavari street,
Governorpet, Vijayawada -2.
Cell : 9948092920

Vijayawada,
Dt:1-9-2023.